# మంత్రి కేటీఆర్ సహకారంతో నియోజకవర్గం అభివృద్ధి



మోహిని చెరువు శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు డివిజన్ కార్పొరేటర్ బి.పద్మారెడ్డితో కలిసి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

- మోహిని చెరువు శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు రూ.2.75 కోట్లు
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వెంకటేశ్

అంబర్‌పేట, సెప్టెంబర్ 30 : రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో అంబర్‌పేట నియోజకవర్గంలో బ్రహ్మాండమైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బాగ్అంబర్‌పేట డివిజన్‌లోని మోహిని చెరువు శ్మశాన వాటికను రూ.2.75కోట్లతో అభివృద్ధి చేసే పనులకు డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రస్తుతం చెరువు గ్రేవ్ యార్డు అభివృద్ధికి మంత్రి కేటీఆర్ రూ.2.75 కోట్లు మంజూరు చేశారన్నారు. అంబర్‌పేట ప్రజలు ఇక్కడకు వచ్చి దహన సంస్కారాలు చేస్తుంటారని, వారికి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని మంత్రి కేటీఆర్ చెప్పారన్నారు. అవసరమైన ఇంకా పదికోట్లు మంజూరు చేస్తానని, ఒక మహాప్రస్థానం లాంటి గ్రేవ్ యార్డు తయారు చేయాలని సూచించారని చెప్పారు. జీహెచ్‌ఎంసీ అధికారులు కూడా ఒక మంచి మోడల్ మహాప్రస్థానం చేయడానికి డిజైన్ చేశారని, వారందరు కూడా కూర్చొని సూచనలు ఇచ్చుకుంటూ దీన్ని అభివృద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఐదు డివిజన్లు ఉన్నాయని, ఇందులో బాగ్అంబర్‌పేట డివిజన్ అంటే తనకు చాలా ప్రేమ అని, ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత డివిజన్‌లోని ప్రతి బస్తీలో అభివృద్ధి పనులు చేశానని చెప్పారు. 15 ఏండ్లు ప్రజాప్రతినిధిగా ఉంటూ ఏమీ పనులు చేయకుండానడుచుకుంటూ దండం పెట్టుకుంటూ పోయి పనులన్నీ విస్మరించిన తరువాత ఈ మూడు సంవత్సరాలు అంటే కోవిడ్ రెండు సంవత్సరాలు పోయిన తరువాత మూడేండ్లలో ప్రతి బస్తీని తాగి అభివృద్ధి చేశానని చెప్పారు. ప్రస్తుత బడ్జెట్‌లో క్వాలిటీ పనులు చేయించుకోవాలని, ఇంకా బడ్జెట్ సరిపోకుంటే మరింత బడ్జెట్ తీసుకొస్తానన్నారు. మహాప్రస్థానం లాగే డెవలప్‌మెంట్ చేసుకుందామని ప్రబంధక కమిటీ సభ్యులకు సూచించారు.

**మూడు వేల డబుల్ బెడ్ రూమ్‌లు ఇచ్చాం...**

అంబర్‌పేట నియోజకవర్గంలో మూడు వేల డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వడం జరిగిందని చెప్పారు. వాటికి సంబంధించి పత్రాలు తను ఇవ్వడం గర్వంగా ఉందన్నారు. ముస్లింలకు గ్రేవ్ యార్డు లేకపోతే మూడు ఎకరాల స్థలం వారి శ్మశాన వాటికకు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. మల్లికార్జుననగర్ వద్ద ఏడెనిమిది ఎకరాల స్థలం ఓయూకు సంబంధించి ఉంది. అందులో మంచి అందమైన పార్కును ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ పేర్రాజు, డీఈ ప్రవీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, సీనియర్ నాయకులు శ్రీరాములుముదిరాజ్, పి. గెల్వయ్య, వి. రవీందర్‌రావు, అరుణ్ కుమార్‌రెడ్డి, దిలీప్, మిర్యాల రవీందర్, ఉప్పు సుధాకర్, నవీన్‌యాదవ్, టి.రమేశ్, సునీల్, కిశోర్, లక్ష్మణ్, క్రాంతి, బాబు, బొట్టు శ్రీను, సాయిరాం, నిరంజన్, మహిళా నాయకురాళ్లు భారతిరెడ్డి, పద్మజ ముదిరాజ్, శారద, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

## వివాహ పరిచయ వేదిక

కాచిగూడ, సెప్టెంబర్ 30: శనివారం కాచిగూడ కార్యాలయంలో విశ్వకర్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అడ్డూరి రవీంద్రాచారి మాట్లాడారు. నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వరంగల్‌లోని శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఉచిత వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పరిచయ వేదికలో యువతీ యువకులు పాల్గొని వివాహ సంబంధాలు కుదుర్చుకోవాలని సూచించారు. వివరాల కోసం ఫోన్ నం. 9848199744లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## 4న ఎస్సీ ఉపకులాల ఆత్మగౌరవ సభ

ఖైరతాబాద్, సెప్టెంబర్ 30 : నగరంలోని ధోబీఘాట్ మైదానంలో ఈ నెల 4న 57 ఉపకులాల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నామని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేశం మోచి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సభకు సంబంధించిన పోస్టర్లను ఆ సంఘం నాయకులు కత్తి మల్లయ్య బేడ బుడగ జంగం, టీఎన్ స్వామి మిత అయ్యల్వార్, తులసీదాస్ గైక్వాడ్ మాంగ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భగా మాట్లాడుతూ రాష్ట్రంలో 22 లక్షల జనాభా ఉన్న దళితుల్లో 34 శాతం ఉపకులాలు ఉన్నాయన్నారు. ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాల్లో అత్యంత వెనుకబడి ఉన్నారన్నారు. సంచార జీవనం గడుపుతున్నారని, మరికొందరు చేతి వృత్తులు, కళారూపాల ప్రదర్శనలతో బతుకీడుస్తున్నారన్నారు. ఉప కులాల కోసం ప్రభుత్వం ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి 2వేల కోట్ల నిధులను కేటాయించాలన్నారు. 4న జరిగే సభకు ముఖ్య అతిథులుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్, కొమురం భీం మనవడు కొమురం సోనేరావు భీం హాజరవుతున్నారని తెలిపారు.

## కేబీఆర్ పార్కువద్ద వరల్డ్ గర్ల్ చైల్డ్ డే వాక్

బంజారాహిల్స్, సెప్టెంబర్ 30 : అంతర్జాతీయ ఆడపిల్లల దినోత్సవం సందర్భంగా లోటస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శనివారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్క్‌వద్ద వాక్ నిర్వహించారు. ఆడపిల్లలను రక్షించండి.. ఆడపిల్లలను చదివించండి అంటూ ప్లకార్డులు పట్టుకున్న వైద్యులు, విద్యార్థులు వాక్‌లో పాల్గొన్నారు. అన్ని రంగాల్లో మహిళలు దూసుకువెళ్తున్నారని, వారిపై వివక్షను మానుకోవాలని లోటస్ ఆస్పత్రి సీఈవో డా.వీఎస్‌వీ.ప్రసాద్ అన్నారు. డా. హేమప్రసాద్ పాల్గొన్నారు.

## 'ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను అడ్డుకుంటాం'



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను కనకరాజు మదిగ

కవాడిగూడ, సెప్టెంబర్ 30 : తెలంగాణలో ఆదివారం పర్యటించనున్న ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను అడ్డుకుంటామని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను కనకరాజు మాదిగ, తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు ఇటికె రాజు మాదిగలు హెచ్చరించారు. ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేపట్టకుండా ప్రధాని నరేంద్ర మోదీ మాదిగలను మోసగించారని ఆరోపించారు. ఈ మేరకు శనివారం వారు కవాడిగూడలో విలేకరులతో మాట్లాడుతూ 2014లో తిరుపతిలో జరిగిన సభలో ఎస్సీ వర్గీకరణ చేపడతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ ఇప్పుడు ఆ హామీని తుంగలో తొక్కి అధికారాన్ని అనుభవిస్తుందని వారు మండిపడ్డారు. వచ్చే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని, లేనిపక్షంలో రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలు బీజేపీ తగిన గుణపాఠం చెప్తారని వారు హెచ్చరించారు. ప్రధాని బహిరంగ సభను బహిష్కరించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎంహెచ్‌డీ రాష్ట్ర అధ్యక్షులు, మర్మాముల మల్లేశ్ మాదిగ, జాతీయ అధ్యక్షుడు బలరాం మాదిగ, టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సింగిరెడ్డి పరమేశ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## పాత నగరంలో మెట్రో రైలు పనులు చేపట్టండి

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 30 : పాత నగర ప్రజలు మెట్రోరైలు కోసం దీర్ఘకాలికంగా ఎదురుచూస్తున్నారని పాత నగర మెట్రోరైలు నిర్మాణ పనులు చేపట్టాలని పాత నగర మెట్రోరైల్ జేఏసీ నాయకులు, సీపీఐ రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు ఈటీ నరసింహా, నగర కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, టీపీసీసీ కా ర్యదర్శి కె. వెంకటేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. పాత నగరంలో సుమారు 30 లక్షలపై చిలుకు జనాభా ఉందని, నిత్యం వివిధ పనుల నిమిత్తం వెళ్లే వారికి మెట్రో రైలు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మెట్రో రైలు ఉండటం వల్ల పాత నగరంలోని ప్రజలకు ఉపాధి పెరగడంతో పాటు ఆ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అ వకాశం ఉంటుందన్నారు. జేఏసీ నాయకులు ఉస్మాన్ బిన్ మొహ్మద్ అల్ హాజరీ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బర్కత్‌పురలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం

కాచిగూడ, సెప్టెంబర్ 30: ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ నేడు(ఆదివారం) పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు కాచిగూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎర్ర భీష్మాదేవ్ శనివారం తెలిపారు. ఉదయం 8.30 నిమిషాలకు కాచిగూడ డివిజన్‌లోని బర్కత్‌పుర రాఘవేంద్ర స్వామి దేవాలయం లైన్‌లో రూ.10 లక్షలు, బర్కత్‌పుర శాలినీ ఆస్పత్రి ఎదురుగా రూ.9 లక్షల వ్యయంతో సంబంధిత అధికారులతో కలిసి డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్ర 11 కులాల ఫెడరేషన్లకు పాలక వర్గాల్ని నియమించాలి



సమావేశమైన 11 కులాల ఫెడరేషన్ల నాయకులు

అంబర్‌పేట, సెప్టెంబర్ 30: రాష్ట్ర 11 కులాల ఫెడరేషన్లకు పాలక వర్గాన్ని నియమించాలని ఫెడరేషన్ల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు శెనిశెట్టి విజయేంద్రసాగర్ ప్రభుత్వాన్ని కోరారు. కమిటీ సమావేశం శనివారం బీసీ సెంటర్‌లో జరిగింది. దీనికి విజయేంద్రసాగర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో కమిటీ సభ్యులంతా కొన్ని తీర్మానాలు చేశారు. 11 కులాలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని, ఇట్టి కులాలకు సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, రాజకీయంగా అవకాశాలు కల్పించాలన్నారు. 11 ఫెడరేషన్లకు ప్రభుత్వం వెంటనే పాలక వర్గాల్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో 11 కులాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను స్థానికులు పర్యవేక్షించాలి

కాచిగూడ,సెప్టెంబర్ 30: అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడూ స్థానికులు పర్యవేక్షించినప్పుడే నాణ్యమైన పనులు జరుగుతాయని కాచిగూడ కార్పొరేటర్ ఉమారమేశ్‌యాదవ్ అన్నారు. డివిజన్‌లోని మోతీమార్కెట్, సునార్‌గల్లి బస్తీలలో నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు పనులను శనివారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణపు పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, ఓంప్రకాశ్, భీంరాజ్, ప్రతిభ, రవియాదవ్, సూరి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సుజాత్‌బిన్అలీ, మానిక్‌షా, శ్రీకిషన్ బద్రుక తదితరులు

కాచిగూడ,సెప్టెంబర్ 30: విద్యార్థులు కొత్త ఆలోచనలతో దేశ అభివృద్ధిలో బాగస్వాములై సమాజ ప్రగతికి తోడ్పడాలని గ్లోబల్ జనరల్ కౌన్సిల్ సభ్యుడు సుజాత్‌బిన్అలీ అన్నారు. బద్రుక కళాశాలల ఆధ్వర్యంలో బద్రుక వాణిజ్య కళాశాల 2023–24 సంవత్సర ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుజాత్‌బిన్అలీ హాజరై మాట్లాడుతూ.. కామర్స్ విద్యార్థులకు ఉజ్వల భవిశత్తు ఉందని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతి విద్యార్థి అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బద్రుక కళాశాల పూర్వ విద్యార్థి మానిక్‌షా, బద్రుక కళాశాల సెక్రటరీ శ్రీకిషన్ బద్రుక, డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ అభిరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.వెంకటయ్య, ఎం.జానకిరాంతో పాటు భవాని, త్రిపుర, విద్యార్థులు పాల్గొన్నారు.

## దాడిచేసిన వ్యక్తి రిమాండ్

కాచిగూడ,సెప్టెంబర్ 30: తాగిన మైకంలో ఇద్దరు వ్యక్తులపై దాడి చేసిన వ్యక్తిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు, ఎస్సై సుభాష్ తెలిపిన ప్రకారం.. ఒడిశా ప్రాంతానికి చెందిన గంగాబెహరా కుమారుడు రిపూ బెహరా(28) కాచిగూడ లింగంపల్లిలోని వుడ్‌సైడ్ హోటల్‌లో పార్సల్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి మద్యం మత్తులో రిపూ బెహరా పింటూ, నిఖిల్ మెడపై కూరగాయల కత్తితో దాడిచేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం రిపూ బెహరాను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సుభాష్ తెలిపారు.